
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నేడు నీటి సరఫరా బంద్

తాండూరు, జూలై 1: తాండూరు విలియంమూన్ చౌరస్తా వద్ద మిషన్‌భగీరథ మెయిన్ పైపులైన్ మరమ్మ తులు నేపథ్యంలో మంగళవారం తాండూరు పట్టణంలో తాగు నీటి సరఫరా నిలిపి వేయనున్నట్లు మున్సిపల్ అధి కారులు తెలిపారు. మరమ్మతులు పూర్తి కాగానే తదుపరి రోజు నుంచి యథావిధిగా నీటి సరఫరా చేస్తామని, పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడాలని కోరారు.

- ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో 61,019 ధరణి దరఖాస్తులు
- తహసీల్దారు స్థాయిలోనే అత్యధికంగా 49,858 దరఖాస్తుల పెండింగ్
- స్పెషల్ డ్రైవ్‌లో 5,390 క్లియర్
- అధికారులు మారినప్పుడల్లా మళ్లీ ఫైల్స్ వెనక్కి
- ఇప్పటికీ రంగారెడ్డి జిల్లాలో మూడుసార్లు..
- తహసీల్దార్, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్న బాధితులు
- సమీక్షలతోనే సరిపెడుతున్న ఆఫీసర్లు



ధరణి.. ఇదేం ధోరణి!

భూసమస్యలకు మోక్షం లభించేనా?

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూ సమస్యలు పరిష్కరించేందుకు పారదర్శకంగా ధరణి పోర్టల్‌ను తీర్చిదిద్దినా వివిధ దశల్లో దరఖాస్తుల పరిశీలనలో జాప్యం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో 61,019 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వరుస ఎన్నికలకు తోడు రెవెన్యూ అధికారుల బదిలీ, కొత్తగా వచ్చిన అధికారులు వీటి పరిష్కారానికి అంతగా ఆసక్తి చూపక పోవడంతో దరఖాస్తులు పేరుకు పోయాయి. కలెక్టర్లు లేదా ఇతర రెవెన్యూ అధికారులు మారితే చాలు.. ఫైల్స్ అన్నీ తిరిగి వెనక్కి పంపించేస్తున్నారు మరోపక్క ధరణి సమస్యలను పరిష్కరించాలని సమీక్షలు నిర్వహిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది.

వికారాబాద్/మేడ్చల్, (ఆంధ్రజ్యోతి), జూలై 1: ఉమ్మడి జిల్లా పరిధిలో వేలసంఖ్యలో భూ సమస్యలు అప రిష్కృతంగానే మిగిలిపోయాయి. ఈ క్రమంలో ధరణి దరఖాస్తుల అమోదం, తిరస్కరణలకు సంబంధించి కలెక్టర్లకు మాత్రమే ఉన్న అధికారాలను విభజించారు. మండ లాల వారీగా స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి తహసీల్దార్లు నాలుగు రకాల మాడ్యూళ్లకు సంబంధించిన దరఖాస్తులు పరిష్కరించనున్నారు. అసైన్డ్ భూములతో పాటు అన్ని రకాల వారసత్వ బదిలీ ప్రక్రియలు, భూసమస్యలకు సంబంధించిన విన తులు, తదితర సమస్యలను తహసీల్దార్లు పరిశీలించనున్నారు. మరికొన్ని సమస్యలను ఆర్డీవో పరిష్కరించనున్నారు. ధరణిలో తప్పొప్పుల సవరణ, నిషేధిత జాబితా, దస్త్రాల ఆధునికీకరణ తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను మండల, జిల్లా స్థాయిలోనే పరిష్కరించేలా అదేశాలి చ్చినా... ఫలితం లేకుండా పోతుంది.

స్పెషల్ డ్రైవ్‌లో పరిష్కారం

ధరణి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో జూన్ 15 నుంచి 28వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వ హించారు. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాత అనేక భూ సమస్యలు తెరపైకి వచ్చాయి. ఖాతా, సర్వేనెంబర్లు మిస్సింగ్, తప్పులు, పట్టా దారుపేర్లు, ఫొటోల్లో తప్పులు, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, పట్టా, అసైన్డ్ భూములు ప్రభుత్వ భూములుగా నమోదు వంటి వాటిలో తప్పులు దొర్లాయి. అలాగే మ్యుటేషన్లు, సక్సెషన్, నాలా, జీపీఏ, పీవోటీ, కోర్టు కేసులు, పాస్‌బుక్ డేటా కరెక్షన్ తదితర దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పరిష్కారం కోసం ధరణి పోర్టల్ టీఎం 33 మాడ్యూల్స్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా సమస్యలు పరిష్క రించక పోవడంతో బాధితులు తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను స్పెషల్ డ్రైవ్‌లో డిస్పోజ్ చేయాలని సూచించింది. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 5,390 దర ఖాస్తులను పరిష్కరించారు. అందులో రంగారెడ్డి జిల్లాలో 3779, మేడ్చల్ జిల్లాలో 592, వికారాబాద్ జిల్లాలో 1,019 దరఖాస్తులను పరిష్కరించారు. రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలో ఇంకా 61,019 దరఖాస్తులు పెండింగ్‌లో చాలా ఉన్నాయి.

డేటా కరెక్షన్ దరఖాస్తులే అధికం

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ దరఖాస్తులు సంబంధించి రంగారెడ్డి జిల్లా లోనే అత్యధికంగా ధరణికి సంబంధించి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. తహసీల్దారు స్థాయిలోనే రంగారెడ్డి జిల్లాలో 30,026 దరఖా స్తులు పెండింగ్‌లో ఉండగా మేడ్చల్ జిల్లాలో 7,172 దరఖాస్తులు పెండిం గ్‌లో ఉన్నాయి. ధరణి పెండింగ్ దరఖాస్తుల్లో అధి కంగా డేటా కరెక్షన్‌కు సంబంధించి పెండిం గ్‌లో ఉన్నాయి. వాటి తర్వాత స్థానం పెండింగ్ మ్యుటేషన్, సక్సే షన్, ల్యాండ్ మ్యాటర్ గ్రీవెన్స్‌కు సబం ధించి పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో డేటా కరెక్షన్‌కు సంబధించి రంగారెడ్డి జిల్లాలో అత్యధి కంగా 15,875 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వికా రాబాద్ జిల్లాలో 5,255 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.. అలాగే మేడ్చల్ జిల్లాలో 2,915 దఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల వివరాలు

	రంగారెడ్డి	మేడ్చల్	వికారాబాద్	మొత్తం
మొత్తం దరఖాస్తులు	40,242	10,592	15,575	66,409
పరిష్కరించినవి	3,779	592	1,019	5,390
పెండింగ్‌లో ఉన్నవి	36,463	10,000	14,556	61,019

వివిధ స్థాయిలో పెండింగ్‌లో ధరణి దరఖాస్తులు

	మొత్తం	తహసీల్దారు	ఆర్డీవో	అదనపు కలెక్టర్	కలెక్టర్
రంగారెడ్డి	36,463	30,026	5,024	1,038	375
మేడ్చల్	10,000	7172	1830	707	291
వికారాబాద్	14,556	12,660	1529	119	248

మాడ్యుల్‌లో దరఖాస్తుల వివరాలు

జిల్లా	రంగారెడ్డి		మేడ్చల్		వికారాబాద్	
మాడ్యుల్	డిస్పోజ్డ్	పెండింగ్	డిస్పోజ్డ్	పెండింగ్	డిస్పోజ్డ్	పెండింగ్
ఎన్ఆర్ఐ పీపీబీ	04	87	02	50	0	39
కోర్టు కేసు ఇన్టిమేషన్	3,027	3,576	108	798	232	946
కోర్టు కేసు పీపీబీ	04	1,670	94	387	04	258
డేటా కరెక్షన్	62	15,875	158	2915	51	5,255
జీపీఏ/ఎగ్జిక్యూటెడ్	119	153	09	12	69	41
నిషేధిత జాబితా	03	7,153	03	3164	61	1,636
ఇష్యూ ఆఫ్ పీపీబీ/నాలా	0	481	22	308	0	11
ఖాతా మెర్జిగ్	17	26	01	09	44	32
లాండ్ మేటర్ గ్రీవెన్స్	43	1,687	06	298	378	2,804
నాలా డబ్ల్యూవో పీపీబీ	5	328	13	151	0	96
ఆర్గనైజేషన్ పీపీబీ	04	07	02	02	01	0
పెండింగ్ మ్యుటేషన్	44	3,438	80	1,165	0	1,767
సక్సేషన్	163	1,381	55	522	179	1,642
అర్బన్ ల్యాండ్	24	601	39	222	0	29
మొత్తం	3,779	36,463	592	10,000	1,019	14,556

నిషేధిత జాబితాల్లో...

నిషేధిత జాబితాల్లో రంగారెడ్డి జిల్లాలో 7,153 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా వికారాబాద్ జిల్లాలో 1,636, మేడ్చల్ జిల్లాలో 3,164 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టు కేసులకు సంబంధించి రంగారెడ్డి జిల్లాలో అధిక మొత్తంలో 3,576 దర ఖాస్తులు పెండింగ్‌లో ఉండగా మేడ్చల్ జిల్లాలో 798 దరఖా స్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ మ్యుటేషన్ రంగా రెడ్డిలో 3,438 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా మేడ్చల్‌లో 1,165 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సక్సేషన్‌కు సంబం ధించి రంగారెడ్డిలో 1,381 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా మేడ్చల్‌లో 522 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వరుస ఎన్నికలకు తోడు రెవెన్యూ అధికారుల బదిలీ, కొత్తగా వచ్చిన అధికారులు వీటి పరిష్కారానికి అంతగా ఆసక్తి చూపక పోవ డంతో దరఖాస్తుల సంఖ్య పేరుకుపోయింది.

అధికారులు మారితే చాలు..

కలెక్టర్లు లేదా ఇతర రెవెన్యూ అధికారులు మారితే చాలు.. ఫైల్స్ అన్నీ తిరిగి వెనక్కి పంపించేస్తున్నారు. శాసన సభ ఎన్నికల సమయంలో ముగ్గురు కలెక్టర్లు మారారు. కొత్త కలెక్టర్ వచ్చినప్పుడల్లా ధరణి దరఖాస్తులను తిరిగి వెనక్కి పంపించేశారు. అలాగే రెవెన్యూ ఉన్నతాధికా రులు మారినప్పుడు కూడా ఇలానే జరుగుతోంది. ఇప్పటి వరకూ మూడు సార్లు ఫైల్స్ తిరిగి పంపించడంతో తహసీల్దారు స్థాయిలో ధరణి దరఖాస్తులు పెద్ద మొత్తంలో పెండిం గ్‌లో ఉన్నట్లు కనిపి స్తున్నాయి.

నిషేధిత జాబితాలో పట్టా భూమి .. అమ్ముకోలేకపోతున్నా



నాకు చేవెళ్ల మండలం, కమ్మెట గ్రామం సర్వేనెంబర్ 71/అ/1/3లో ఎకరం, సర్వేనెంబర్ 88/అ/2/3వి 11లో 10 గుంటలు భూమి ఉంది. మొత్తం 1.10 గుంటల భూమి ఉంది. ధరణిలో నిషేధిత జాబితాలో పడింది. దీంతో నేను అమ్ముకోలేక పోతున్నా. పట్టా భూమిని నిషేధిత జాబితా నుంచి తీసి వేయాలని పలు మార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేశాను. సమస్య అలాగే ఉంది.

- తల్లారి సంజీవ, బాధిత రైతు, కమ్మెట గ్రామం

ధరణి సమస్యలపై ప్రత్యేక డ్రైవ్

- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్(ఆంధ్రజ్యోతి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ధరణి సమస్యలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో ధరణి సంబంధించి దాదాపు 10వేల దరఖాస్తులు రాగా అందులో కేవలం 592 మాత్రమే పరిష్కారమయ్యాయి. వేలసంఖ్యలో దరఖాస్తులు పేరుకుపోవడంతో త్వరితగతిన వాటిని పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లోనే 5 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. తహసీల్దార్‌లు, ఆర్డీవోలు ప్రతి రోజు కలెక్టరేట్‌లోనే వారి సిబ్బందితో కలిసి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించే విధంగా ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.



కలెక్టరేట్‌లో ధరణి సమస్యలను పరిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

కాంగ్రెస్‌లో చేరికల కలకలం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికపై భిన్నాభిప్రాయాలు
- తమకు సమాచారం లేకపోవడంపై సీనియర్లు నారాజ్
- కష్టకాలంలో పార్టీ వెన్నంటి ఉన్న వారిని గుర్తించాలంటున్న సీనియర్లు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

బీఆర్ఎస్ నుంచి వలసలు ప్రారంభం కావడంతో కాంగ్రెస్ సీనియర్లలో కలకలం మొదలైంది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలను, నేతలను పార్టీలో చేర్చుకోవడంపై అధికార కాంగ్రెస్ నేతల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చేరికల విషయంలో కాంగ్రెస్ సీనియర్లు నారాజ్‌గా ఉన్నట్లుగా తెలుస్తోంది. తమకు ఏ మాత్రం సమాచారం ఇవ్వకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలను చేర్చుకుంటున్నారని, పార్టీని నమ్ముకున్న తమ పరిస్థితి ఏమిటని కొందరు సీనియర్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల కిందట చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. యాదయ్య చేరికపై చివరి వరకు పార్టీలో కీలక నేతలకు కానీ నియోజకవర్గ నేతలకు సమాచారం లేకపోవడం గమనార్హం. యాదయ్య చేరికను కాంగ్రెస్ నాయకత్వం చివరి వరకు అత్యంత గోప్యంగా ఉంచింది. అయితే, యాదయ్య చేరికను నవాబుపేట మండల కాంగ్రెస్ నేతలు వ్యతిరేకిస్తూ నిరసన దీక్ష చేపట్టారు. అలాగే నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు రెండుగా చీలినట్లు ప్రచారం సాగుతోంది. గత ఎన్నికల్లో పోటీచేసి స్వల్ప ఓట్లతో ఓటమి చెందిన భీమ్‌భరత్ దీనిపై బహిరంగంగా ఏమీ మాట్లాడనప్పటికీ ఆయన వర్గీయులు మాత్రం యాదయ్య రాకపై నారాజ్‌గా ఉన్నారు. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లా నుంచి త్వరలో మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు విస్తృత ప్రచారం సాగుతోంది. అయితే తమతో అసలు పొసగని ఎమ్మెల్యేలను అడ్డుకునేందుకు కాంగ్రెస్‌లో కొందరు నేతలు అధిష్టానం వద్ద కూడా ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. మహేశ్వరం నుంచి పోటీ చేసి ఓటమి చెందిన కేఎల్లార్ బాహాటంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలను వ్యతిరేకిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన వారిని అసలు కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దంటూ ఆయన నిరసన వ్యక్తం చేస్తున్నారు. వారిని పార్టీ ద్రోహులుగానే గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులను ఏకం చేసే యత్నం చేస్తున్నారు. ఒకవేళ ఎవరినైనా ఇతర పార్టీ నేతలను చేర్చుకుంటే కాంగ్రెస్ నుంచి ఓడిన అభ్యర్థులనే ఇన్‌చార్జ్‌లుగా నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు మరికొందరు చేరికల విషయంలో పార్టీ నిర్ణయాలను సమర్థిస్తున్నారు. ప్రభుత్వ మనుగడ కోసం ఇది తప్పదని సీనియర్లు కొందరు చెబుతున్నారు. ఇదే సమయంలో పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న వారిని విస్మరించకుండా వారికి కూడా మంచి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందంటున్నారు. ఇదిలా ఉంటే బీఆర్ఎస్, ఇతర పార్టీల నేతల చేరికల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం సర్వాధికారాలు ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. చేరికలను వ్యతిరేకించే నేతలతో ఆయన నేరుగానే మాట్లాడుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే వచ్చే రెండు, మూడు రోజుల్లో నగర శివార్లలోని ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేరుతున్నట్లు ప్రచారం సాగుతోంది. దశలవారీగా మిగతా వారిని చేర్చుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. చేరికల బాధ్యతలను ఉమ్మడి జిల్లాలో కొందరు నేతలకు అప్పగించడంతో పాటు నేరుగా సీఎం కూడా మాట్లాడుతున్నట్లు తెలిసింది.



ఎమ్మెల్యే సబితారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సబితారెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు

- దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన

మహేశ్వరం, జూలై 1 : బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి చేరడానికి పావులు కదుపుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఎట్టి పరిస్థితుల్లో పార్టీలో చేర్చుకోవద్దని ఎంపీపీ సునీతా అంధ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్, వత్తుల రఘుపతిలు డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం గ్రామశాఖ అధ్యక్షుడు లాజర్ ఆధ్వర్యంలో సబితాఇంద్రారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో సబితారెడ్డి లాంటి వారిని చేర్చుకోవద్దని పీసీసీకి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణానాయక్, పాండునాయక్, కొమురయ్య, ఇ.వెంకటేష్, జి.జంగయ్య, కె.రాములు, బి.విజయ్ సూర్య, టి.శివ, శేఖర్‌రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

వికారాబాద్, మేడ్చల్ కలెక్టర్లు ప్రతీక్ జైన్, గౌతమ్

వికారాబాద్, జూలై 1 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు నుంచి 178 అర్జీలు స్వీకరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో ధరణి, రెవెన్యూ శాఖ, పెన్షన్, భూ సర్వే, శిశు సంక్షేమశాఖ, తదితర శాఖలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిని సంబంధిత అధికారులకు పంపి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని ఫిర్యాదు దారులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసు చంద్ర, జడ్పీసీఈవో సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ...

మేడ్చల్(ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి విశేష స్పందన లభించింది. జిల్లా నుంచి ప్రజలు పెద్ద ఎత్తున ప్రజావాణిలో వివిధ సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో 114 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, లాఆఫీసర్ చంద్రవతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్

అవగాహనతోనే డెంగీ నిర్మూలన సాధ్యం

పరిగి, జూలై 1: అవగాహనతోనే డెంగీ వ్యాధి నిర్మూలన సాధ్యమని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం పరిగిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమ లార్వాలను నిర్మూలించే టెన్నిపాస్ అనే మందును నిల్వ ఉన్న ప్రాంతాల్లో పిచికారికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దోమల ద్వారా మలేరియా,డెంగీ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలపరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటయ్య, నాయకులు మౌలనా తదితరులు పాల్గొన్నారు.



పరిగిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

సబితారెడ్డి దిష్టిబొమ్మ దహనంపై ఫిర్యాదు


సీఐకి ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మహేశ్వరం, జూలై 1: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు డి.కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో నాయకులు సయ్యద్ ఆదిల్‌అలీ, ఎం.నవీన్‌లు సీఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడం కాంగ్రెస్ పార్టీ నాయకులకు సరికాదన్నారు. బీఆర్ఎస్‌ను వీడేది లేదని ఆమె పత్రికా ముఖంగా చెప్పినా దిష్టిబొమ్మను దహనం చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు గడుస్తున్నా ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేయడంలో నిమగ్నం కాకుండా.. బీఆర్ఎస్ నేతలపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. సబితాఇంద్రారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు కె.వాసుబాబు, కె.ప్రభాకర్, సుధీర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

20వేల మందితో 12న పూరి జగన్నాథ రథయాత్ర


రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఆమనగల్లు, జూలై 1 : ఆమనగల్లు పట్టణంలో ఈనెల 12న 20వేల మందితో పూరి జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు రథయాత్ర నిర్వాహణ వ్యవస్థాప్రముఖ్ పాపిశెట్టి రాము, కన్వీనర్ తల్లోజు వెంకటయ్య, శోభయాత్ర ప్రముఖ్ ఎంగళి బాలకృష్ణలు తెలిపారు. హైదరాబాద్ కూకట్‌పల్లి ఇస్కాన్ దేవాలయం వారి సహకారంతో నిర్వహించే రథయాత్రకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో సోమవారం జగన్నాథ్ రథయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ మండలాలకు చెందిన భక్తులు, రథయాత్ర నిర్వాహకులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రథయాత్రకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను భక్తులతో కలిసి వారు ఆవిష్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి రథయాత్రకు జనసమీకరణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక అయ్యప్ప కొండ దేవాలయం నుంచి రథయాత్ర ప్రారంభమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బావండ్ల అంజయ్య, దోమ మోహన్‌రెడ్డి, గుర్రం భద్రయ్య, చల్ల శ్రీనివాస్‌రెడ్డి, తల్లోజు మాధవాచారి, ముక్కెరి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి


విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

షాబాద్, జూలై 1 : మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలో విద్యుత్ కార్యాలయం ఎదుట విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని బొబ్బిలిగామ, షాబాద్, అంతిరెడ్డిగూడ, కేశవగూడ, నాగర్‌గూడ, మల్లారెడ్డిగూడ తదితర గ్రామాల్లో విద్యుత్ లూప్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచెలు, ఆన్ ఆఫ్ సిస్టంలు పనిచేయక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని అన్నారు. ఆయా గ్రామాల్లోని సమస్యలను లైన్‌మెన్ల దృష్టికి తీసుకెళితే.. డబ్బులు ఇస్తేనే పనులు చేస్తామని డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించి బాధ్యులైన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం మండలాధ్యక్షుడు యాదవరెడ్డి, కార్యదర్శి కృష్ణ, కోశాధికారి చంద్రయ్య, జిల్లా కార్యవర్గసభ్యులు సత్యనారాయణరెడ్డి రైతులున్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట్, జూలై 1: సీఎం సహాయనిధి పేదలకు అండగా నిలుస్తోందని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మండలంలోని టేకులపల్లి గ్రామానికి చెందిన బి.పద్మ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో ఆమెకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ రూ.2,10,000 చెక్కును సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి.మల్లారెడ్డి, కె.మహేందర్‌చారి, భాస్కర్, పురుషోత్తంరెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం: మండల కేంద్రానికి చెందిన బాబురావు హైదారాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన చికిత్స కోసం సీఎం సహాయ నిధి కింద కుటుంబ సభ్యులకు రూ.2లక్షల 10వేలు మంజూరయ్యాయి. ఈ ఎల్‌వోసీని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం ఆయన నివాసంలో అందజేశారు.

వాడీవేడిగా చివరి సర్వసభ్య సమావేశం

● సమస్యలు లేవనెత్తిన ఎంపీటీసీలు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

తాండూరు రూరల్, జూలై 1: తాండూరు మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. తాండూరు మండలం ఎంపీపీ అనితాగౌడ్ అధ్యక్షతన సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈనెల 4వ తేదీతో ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగియనుండగా ఇదే ఆఖరు సమావేశం. ఈ సందర్భంగా ఎంపీటీసీలు తమ సమస్యలను ప్రస్తావించారు. అంతారం గ్రామంలో 15రోజుల నుంచి తాగునీరు రాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఎంపీటీసీ శాంతు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాండూరు పట్టణం శేష్‌ప్రభ థియేటర్ నుంచి గౌతాపూర్ వరకు ఆర్ అండ్ బీ రోడ్డు గుంతలమయమైందని ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి ఆర్ అండ్ బీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అదేవిధంగా కరన్‌కోట్ గ్రామంలో 10వేల మంది జనాభా ఉన్నారని, ఒకే రేషన్‌దుకాణం ఉందని ఎంపీటీసీ రాజ్‌కుమార్ సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. మల్కాపూర్ ఐసీఎల్ ఫ్యాక్టరీకి వెళ్లేదారిలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని మరమ్మతులు చేయాలని ఎంపీటీసీ రవిసింధే కోరారు. కరన్‌కోట్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నైట్ వాచ్‌మెన్, అటెండర్, స్వీపర్ పోస్టులను భర్తీచేయాలని ఎంపీటీసీ వసంత్‌కుమార్ కోరారు. అనంతరం ఎంపీటీసీలను ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. కొందరు ఎంపీటీసీలు తమ ఐదేళ్ల పాలన అనుభవాలను సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు అవకాశం ఇస్తే మళ్లీ గెలిచి సమావేశం వస్తామని ఎంపీటీసీలు పేర్కొన్నారు.

అదనపు కలెక్టర్‌కు సన్మానం



మేడ్చల్ జూలై 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బదిలీపై వెళ్లిన జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) అభిషేక్ అగస్త్యాను సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తదితరులు ఘనంగా సత్కరించారు.

కేవైసీ అప్డేట్ చేయాలని రూ.4లక్షలు టోకరా

తాండూరు , జూలై 1: ఫోన్‌కాల్‌లో కేవైసీ అప్డేట్ చేయాలని చెప్పి ఓ లింక్‌ను పంపగా అది ఓపెన్ చేసిన వ్యక్తి తన ఖాతాలో రూ.4లక్షలు పోగొట్టుకున్నాడు. తాండూరు సీఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాండూరు పట్టణం గుమస్తానగర్‌కు చెందిన చామకూర ప్రవీణ్ కుమార్ మార్చి 6వ తేదీన ఫోన్‌లో ఇంటర్నెట్ బ్యాంకింగ్ నుంచి డబ్బులు బదిలీ చేస్తుండగా 8945841371సెల్ ఫోన్ నుంచి కాల్ వచ్చింది. ఆ కాల్‌ను లిఫ్ట్ చేయగా యూనియన్ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని మీ కేవైసీ వివరాలను అప్డేట్ చేయాలని ఓ లింక్‌ను పంపారు. అది నిజమేనని నమ్మిన ప్రవీణ్ ఆ లింక్‌ను ఓపెన్ చేయగా ఖాతాలో నుంచి రూ.4,06,087 డెబిట్ అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సైబర్ నేరానికి గురైతే టోల్ ఫ్రీనెంబర్ 1930కు కాల్ చేయాలని సూచించారు.

1069 మంది ఎస్‌జీటీల బదిలీ

వికారాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1069 మంది ఎస్‌జీటీలను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాలో బదిలీల కోసం 2703 మంది ఎస్‌జీటీలు దరఖాస్తు చేసుకోగా, వారిలో 1069 మంది ఎస్‌జీటీలు బదిలీ అయ్యారు. మిగతా వారు ప్రస్తుతం పని చేస్తున్న స్థానాల్లోనే కొనసాగనున్నారు. జిల్లాలో స్థానిక సంస్థలకు సంబంధించిన పాఠశాలల్లో పనిచేస్తున్న 1007మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. వీరితో పాటు 50 మంది ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు, 12మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు బదిలీలు వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఎస్‌జీటీలు మంగళవారం తమకు కేటాయించిన పాఠశాలల్లో చేరాల్సి ఉంటుంది.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎంసీపీఐ (యూ) నాయకులు

ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న పేదలకు పట్టాలివ్వాలి

ఎంసీపీఐ (యూ) జిల్లా సహాయ కార్యదర్శి తుడుం అనిల్‌కుమార్

రంగారెడ్డి అర్బన్, జూలై 1 : ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని ఎంసీపీఐ (యూ) జిల్లా సహాయ కార్యదర్శి తుడుం అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని, సొంత స్థలం ఉన్న వారికి రూ.5 లక్షలు ఇవ్వాలని, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని, మిగులు డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంచాలని కోరుతూ ఎంసీపీఐ (యూ) ఆధ్వర్యంలో లబ్ధిదారులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ పరిధిలోని ముజఫర్ అహ్మద్‌నగర్, స్టాలిన్‌నగర్, నడిగడ్డ తండా, పోగుల అగయ్యనగర్, సుభాష్ చంద్రబోస్ నగర్, ఓంకార్ నగర్, టేకు నర్సింహనగర్, బస్తీవాసులు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారన్నారు. వీరి నివాసాలకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చి చట్టబద్ధత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



ఆట బొమ్మలు.. ఆకట్టుకునేట్టు

మొయినాబాద్ రూరల్, జూలై 1: చిన్న పిల్లలకు ప్రతీ ఇంట్లో ఆటలాడుకునేందుకు తల్లిదండ్రులు వివిధ రకాల బొమ్మలు తీసుకొస్తారు. కాలం మారుతున్న కొద్దీ ఆట బొమ్మలు, వస్తువుల్లో కూడా కొత్తదనం కనిపించేలా కంపెనీలు తయారు చేస్తుంటాయి. అయితే, వాటిని విక్రయించే వారు కూడా ఎక్కువ మొత్తంలో అమ్మడానికి నానా తంటాలు పడుతుంటారు. రోడ్డు పక్కన, ప్రధాన కూడళ్లలో, జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో విక్రయానికి ఉంచుతారు. వివిధ దుకాణాలు, షాపింగ్ మాల్‌లలో వివిధ రకాల ఆటబొమ్మలు, వస్తువులు దొరుకుతున్నప్పటికీ కొందరు బతుకుదెరువు కొరకు రోడ్లపక్కన ఆట బొమ్మలు, వస్తువులను విక్రయిస్తారు. ఈక్రమంలో వినియోగదారులను ఆకట్టుకోవడమే లక్ష్యంగా ఓ చిరు వ్యాపారి హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి హిమాయత్‌నగర్ చౌరస్తా సమీపంలో రహదారి పక్కన ఇలా ఆట బొమ్మలను చెట్లకు వేళాడదీసి విక్రయిస్తున్నాడు.


స్పీకర్, మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

స్పీకర్, ఐటీ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, జూలై 1 : ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబులను సోమవారం కలిశారు. హైదరాబాద్‌లో వేర్వేరుగా వారి వారి నివాసాల్లో ఎమ్మెల్యే యాదయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి సన్మానించారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సిద్ధాపూర్ భూములను సర్వే చేయించండి

▸ మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే శంకర్ వినతి

షాద్‌నగర్ అర్బన్, జూలై 1: కొత్తూర్ మండలంలోని సిద్ధాపూర్ గ్రామ శివారులో గల ప్రభుత్వ భూములను సర్వే చేసి, పరిరక్షించాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. సర్వే చేసి, ప్రభుత్వ భూముల హద్దులను నిర్ణయించి, ఆ భూములు ప్రజల అవసరాలకు వినియోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సిద్ధాపూర్ గ్రామంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు చాలా మంది ఉన్నారని, వారందరికీ ఇళ్ల స్థలాలను కేటాయించడానికి ప్రభుత్వ భూమిలోని 15 నుంచి 20 ఎకరాలు కేటాయించాలని కోరారు. ఈ అంశంపై స్పందించిన మంత్రి.. వెంటనే రంగారెడ్డి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారని, సర్వే చేసి, హద్దులను నిర్ణయించాలని ఆదేశించారని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు.


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న వీర్లపల్లి శంకర్

చెరువును తలపిస్తున్న కాకునూర్ చౌరస్తా

కేశంపేట, జూలై 1: మండల కేంద్రంలోని కాకునూర్ చౌరస్తా వర్షపు నీటితో చెరువును తలపిస్తోంది. ఇటీవల కురుస్తున్న వానలకు తరచూ వర్షపు నీటితో నిండి పోతోంది. కాగా, వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో ఇబ్బందిగా ఉంటోంది. కేశంపేట-షాద్‌నగర్ రోడ్డు మడుగులా దర్శనమిస్తోంది. నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనచోదకులతో పాటు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


కాకునూర్ చౌరస్తాలో నిలిచిన వర్షపు నీరు

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

యాచారం, జూలై 1 : అక్రమంగా గంజాయి కలిగి ఉన్న ఇద్దరు యువకులను సోమవారం రాత్రి యాచారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల కేంద్రానికి చెందిన బండారి శివ బైక్ మెకానిక్, కోరే ఉదయ్‌కిరణ్ ప్రైవేటు ఉద్యోగి. కాగా, వీరిద్దరు యాచారం పంచాయతీ పరిధిలోని గాండ్లగూడలో సోమవారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. పోలీసులకు అనుమానం వచ్చి ప్రశ్నించడంతో పొంతనలేని సమాధానం చెప్పారు. దాంతో అదుపులోకి తీసుకొని విచారించగా 250 గ్రాముల గంజాయి పట్టుబడిందని ఎస్సై గోపాల్, సీఐ శంకర్‌కుమార్‌లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. కాగా, యాచారంలో మొదటిసారి గంజాయి పట్టుబడడం కలకలం రేపింది.

వరదలపై ఎమ్మెల్యే సమీక్ష

▸ నాలా కబ్జాల విముక్తికి సంయుక్త సర్వే

▸ నేటి నుంచి రంగంలోకి అధికారులు

తాండూరు, జూలై 1: తాండూరులో ఆదివారం రాత్రి కురిసిన వర్షాలతో పట్టణంలో పలు వార్డులు జలమయమయ్యాయి. దీంతో పాటు తాండూరు-హైదరాబాద్ రోడ్డుమార్గం జలదిగ్బంధం కావడంతో వాహనాల రాకపోకలకు 3గంటల పాటు అంతరాయం ఏర్పడింది. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ ఇరిగేషన్, ఆర్అండ్‌బీ అధికారులు సంయుక్త సర్వేచేసి నాలాల కబ్జాలను గుర్తించి ఎవరి ఒత్తిళ్లకు లొంగకుండా కబ్జాల నుంచి విముక్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్ రోడ్డు మార్గం, చిలుక వాగు కబ్జాలపై కఠినంగా వ్యవహరించి నీటినిల్వ లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా ఇలాంటి పరిస్థితి పునరావృత్తం కావొద్దని సూచించారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డు మార్గం సెంటల్ లైటింగ్‌లు వెలగకపోవడంపై సంబంధిత కాంట్రాక్టర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. గత ప్రభుత్వ హయాంలో హైమాస్ట్ లైట్లను పంచాయతీరాజ్ అధికారులు, బీఆర్ఎస్ నేతల ఫాంహౌస్, ఫంక్షన్‌హాల్‌ల వద్ద పెట్టాలని కౌన్సిలర్ నీరజ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. నేషనల్ హైవే రోడ్డు పనుల జాప్యం వల్ల కూడళ్ల అభివృద్ధి జాప్యం అవుతున్నారని చైర్‌పర్సన్ స్వప్న తెలిపారు. అవసరమైన నిధులు బల్దియా నుంచి కేటాయించి అత్యవసర పనులు వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్పీ బాలకృష్ణ, కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, కౌన్సిలర్లు విజయదేవి, సాహు శ్రీలత, భీంసింగ్, ప్రభాకర్‌గౌడ్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


వరదలపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

వరద కష్టాలపై యాక్షన్ ప్లాన్: ఎమ్మెల్యే

రూ.16 కోట్లతో చిలకవాగు అభివృద్ధి చేసి అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చెప్పారు. సమీక్ష అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాండూరులో 20ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ ఉందన్నారు. పాలిషింగ్ యూనిట్లు, వ్యర్థాలు ఎక్కడబడితే అక్కడ వేయకుండా సహకరించాలని కోరారు.

ఫ్చే.. వేలం వట్టిదేనా?

▸ జమకాని చికెన్, మటన్ వ్యర్థాల వేలం డబ్బులు

▸ ముగిసిన గడువు

▸ పట్టించుకోని మున్సిపల్ అధికారులు

▸ మున్సిపాలిటీ ఆదాయానికి గండి

తాండూరు, జూలై 1: చికెన్, మటన్ వ్యర్థాల బహిరంగ వేలం రాష్ట్రవ్యాప్తంగా రికార్డు వేలంగా చెప్పొచ్చు. తాండూరులో ఈనెల 18న సాయంత్రం 4గంటలకు వేలం నిర్వహించగా కొడంగల్ పట్టణానికి చెందిన ఎండీ.రఫీ రూ.30లక్షల 65 వేలకు టెండర్‌ను దక్కించుకున్నారు. తాండూరు కంటే పెద్ద మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఉన్నా ఏ మున్సిపాలిటీలోనూ ఇంతపెద్ద మొత్తంలో వేలం పాడలేదు. అయితే టెండర్ ముగిసిన ఏడు రోజుల్లోపు వేలంలో పాడిన మొత్తాన్ని చెల్లించాల్సివుంది. జూన్ 26వ తేదీ లోపు ఎండీ.రఫీ టెండర్ డబ్బులను చెల్లించాలి. గడువు ముగిసి ఐదు రోజులవుతున్నా మున్సిపాలిటీకి టెండర్ దక్కించుకున్న రఫీ ఇంత వరకు ఆ నగదును చెల్లించలేదు. దీంతో జూలై 1 నుంచి అగ్రిమెంట్ చేసుకుని అప్పగించాల్సిన వ్యర్థాల సేకరణకు బ్రేక్‌పడింది. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్ అధికారులు బహిరంగ వేలంలో విధించిన నిబంధనల ప్రకారం టెండర్ దక్కించుకున్న టెండర్‌దారుడు సకాలంలో చెల్లించకపోతే డిపాజిట్ దరావత్తును జప్తు చేసుకుని టెండర్ ప్రక్రియను చేపడుతామని తెలిపారు.


బహిరంగ వేలం(ఫైల్)

మూడోసారి వాయిదా

గతంలో ఆర్డీవో అశోక్‌కుమార్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న సమయంలో బహిరంగ వేలం లేకుండా నేరుగా కంపెనీ వారికి ఆర్డర్ ఇవ్వడాన్ని తాండూరువాసులు తప్పుబట్టారు. ఈ మేరకు సీడీఎంకు ఫిర్యాదు చేయగా అప్పట్లో ఆర్డర్‌ను రద్దు చేశారు. తర్వాత కమిషనర్ శంకర్ సింగ్ సమయంలో నిబంధనల మేరకు టెండర్ ప్రక్రియను చేపట్టగా ఓ కంపెనీపై కేసులు ఉన్నందున ఇవ్వదంటూ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ ఫిర్యాదుతో ఈ ప్రక్రియ ఆగిపోయింది. గత నెల 18న బహిరంగ వేలం నిర్వహించగా వేలం దక్కించుకున్న రఫీ ఇంత వరకు డబ్బులను జమ చేయలేదు. దీంతో మూడో సారి మళ్లీ వాయిదా పడినట్లే.



కోర్టు పరిధిలో వ్యర్థాల కేసు

చికెన్, మటన్ వ్యర్థాలకు సంబంధించిన కేసు హైకోర్టులో ఇంకా కొనసాగుతోంది. హైకోర్టులో విచారణ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. కేసు విచారణ పూర్తయ్యాక వేలం నిర్వహిస్తారా? ముందుగా నిర్వహిస్తారా? అనేది వేచిచూడాల్సివుంది.


చేవెళ్ల : గుండాలలో రైతులతో మాట్లాడుతున్న గీతారెడ్డి

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

▸ జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి

చేవెళ్ల/షాబాద్, జూలై 1 : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి తెలిపారు. సోమవారం చేవెళ్ల మండల పరిధిలోని గుండాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నక్క బుచ్చిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గీతారెడ్డి హాజరై రైతుల నుంచి రైతు భరోస పథకం అమలుపై సూచనలు, సలహాలు తీసుకున్నారు. చాలా మంది రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ భూములకే ప్రభుత్వం సాయం ఇవ్వాలని అభిప్రాయం తెలిపారు. కొందరు రైతులు 5 నుంచి 10 ఎకరాల వరకు మాత్రమే రైతు భరోసా వర్తింపజేయాలని కోరారు. అనంతరం గీతారెడ్డి మాట్లాడుతూ రైతులు అభిప్రాయాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఏడీఏ రమాదేవి, ఏవో తులసి, ఏఈవోలు స్వాతి, సొసైటీ సీఈవో మధుసూదన్, తదితరులు ఉన్నారు. అదేవిధంగా రైతు భరోసాను అర్హులైన వారికే వర్తింపజేయడమే ప్రభుత్వ ఉద్దేశ్యమని గీతారెడ్డి అన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని రైతువేదికలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మహాజన సభ నిర్వహించి రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టారు. మహాజన సభలో పాల్గొన్న 50 మంది రైతుల అభిప్రాయాలు సేకరించగా 30మంది 10 ఎకరాల వరకు రైతు భరోసా వర్తింపజేయాలని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు గీతారెడ్డి తెలిపారు. చేవెళ్ల డివిజన్ వ్యవసాయాధికారి రమాదేవి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అధికారి సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్, మండల వ్యవసాయాధికారి వెంకటేశం, పీఏసీఎస్ సీఈవో శివకుమార్‌రెడ్డి, ఏఈవోలు, డైరెక్టర్లు రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేస్తే మళ్లీ గెలిపిస్తారు

▸ ఎంపీటీసీల వీడ్కోలు సమావేశంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, జూలై 1: ప్రజలకు సేవచేస్తే ప్రజాప్రతినిధులుగా మళ్లీ గెలిపిస్తారని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు మండల ఎంపీపీ అనితాగౌడ్ అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం ఈనెల 4వ తేదీన ఎంపీటీసీల పదవీకాలం ముగియనున్న సందర్భంగా వారిని శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. నిత్యం ప్రజల్లో ఉండి వారికి మంచిచేస్తే మళ్లీ సర్పంచులు, ఎంపీటీసీలుగా గెలపిస్తారని అన్నారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థలను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి బలోపేతం చేస్తారన్నారు. బీసీ కుల గణన వల్ల సర్పంచులు, ఎంపీటీసీల రిజర్వేషన్లు మారే అవకాశం ఉందన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఇప్పటికీ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి కింద 200యూనిట్లలోపు కరెంటు బిల్లు ఉన్న వారికి జీరో బిల్లు అందజేస్తున్నామని తెలిపారు. అర్హులైన పేదవారికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ సంగెం రవిగౌడ్, ఎంపీపీ అనితాగౌడ్, వైస్‌ఎంపీపీ స్వరూపారెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు శంషొద్దీన్, ఎంపీటీసీలు రవిసింధే, వసంత్‌కుమార్, రాజ్‌కుమార్, శివకుమార్, శాంత్‌కుమార్, బస్వరాజమ్మ, సుశీలమ్మ, శ్యామల, రత్నమాల, నర్సమ్మ, సీతాబాయి, నాయకులు వడ్డె శ్రీనివాస్, ఎస్.పండరి, మేఘనాథ్ గౌడ్, విజయలక్ష్మి, వెంకటేశం, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.


ఉమ్మడి జిల్లా డైరెక్టర్ తాండూరు ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

రేవంత్ రెడ్డిని తిరస్కరించిన పాలమూరు ప్రజలు

▸ ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి రేవంత్ కు చెంపపెట్టు

▸ ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి

ఆమనగల్లు, జూలై 1: ఎమ్మెల్సీ బరి నుంచి తప్పుకుంటే రూ.30 కోట్లు, కార్పొరేషన్ చైర్మన్ ఇస్తామని అధికార పార్టీ నేతలు ఎర చూపినా తిరస్కరించి పోటీలో నిలిచిన తనను ఆదరించి గెలిపించిన ప్రజలకు ఆజన్మాంతం రుణపడి ఉంటానని, ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎమ్మెల్సీగా తన విజయం సీఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు అన్నారు. మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో లేకపోయినా ఆపత్కాలంలో పార్టీకి వెన్నుదన్నుగా నిలిచి తనన ఎమ్మెల్సీగా గెలిపించారని ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మీగార్డెన్‌లో సోమవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీగా గెలుపొందిన నవీన్‌కుమార్ రెడ్డికి అభినందన సభ, పదవీ కాలం ముగుస్తున్న కల్వకుర్తి నియోజకవర్గ ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులకు ప్రజాసేవ పురస్కార ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్, జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ, ప్రవీణ్‌కుమార్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలను ఉప్పల వెంకటేశ్ ఘనంగా సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. తలకొండపల్లి ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిని పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో సొంత జిల్లా పాలమూరు ప్రజలు తిరస్కరించి తగిన గుణపాఠం చెప్పారన్నారు. పాలమూరు జిల్లాలో బీజేపీకి ఓట్లు లేవని, 80 శాతం బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి పడ్డాయన్నారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మంచి చేసేవారే ప్రజా నాయకులు అవుతారన్నారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వెంకటేశ్ చేస్తున్న సేవలు ప్రజల్లో చిరస్థాయిగా ఉంటాయన్నారు. జడ్పీటీసీ మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయడమే తనకు తెలిసిన రాజకీయమన్నారు. ఎంపీపీలు నిర్మలశ్రీశైలం గౌడ్, మనోహర, విజయ, జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, అనురాధపత్యానాయక్, వైస్ ఎంపీపీలు ఆనంద్, శంకర్‌నాయక్, శాంతి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు జీఎల్ఎన్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ముజిబుర్‌రహెమాన్, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి : కసిరెడ్డి

ఆమనగల్లు, జూలై 1: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందించేందుకు సమీకృత గురుకుల పాఠశాలల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల, వెల్దండ మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. కొత్త పాఠశాలలో రవీందర్‌రావు సహకారంతో సమకూర్చిన నోట్‌పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. బొల్లంపల్లిలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న జంగయ్యను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద బిడ్డలకు నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు కల్పించడం కోసం సమీకృత గురుకులాల ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో వృత్తినైపుణ్య శిక్షణ యూనివర్సిటీ ఏర్పాటుకు సీఎం హామీ ఇచ్చారని, వర్సిటీ ఏర్పాటుకు వంద ఎకరాల స్థలాన్ని సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తిచేసి వినియోగంలోకి తెస్తామని చెప్పారు. జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, సంజీవ్‌కుమార్, భూపతిరెడ్డి, ఆనంద్, మోతిలాల్, పర్వత్‌రెడ్డి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

శ్రీచైతన్య పాఠశాలను సీజ్‌చేయాలి

▸ పాఠశాల ఎదుట ధర్నా చేపట్టిన ఏబీవీపీ నాయకులు

మహేశ్వరం జులై 1: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రీచైతన్య పాఠశాలను వెంటనే సీజ్‌చచేయాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు కందడి శ్రీరాం డిమాండ్ చే శారు. సోమవారం ఆ సంఘం నగర కార్యదర్శి జమాల్ రాఘవేందర్ ఆధ్వర్యంలో శ్రీ చైతన్య పాఠశాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కందడి శ్రీరాం పాల్గొని మాట్లాడారు. మండల కేంద్రంలో అనుమతులు లేకుండా విద్యాను వ్యాపారం చేస్తూ కార్పొరేట్ తరహాలో నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యాపారంమే ధ్యేయంగా మారిన పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్‌కేసు నమోదు చేసి... పాఠశాలలో చేరిన విద్యార్థులను అనుమతులు ఉన్న పాఠశాలలో చేర్పించాలన్నారు. ఏబీవీపీ నాయకులు రాజేష్, సిద్దు, ప్రవీణ్, అభిలాష్, లఖాన్, నవీన్, సయ్యద్, శ్రీకాంత్, దుర్గప్రసాద్, ప్రణీత్, రోహిత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మెగా డీఎస్సీ వేయాలి

వికారాబాద్, జూలై 1: నిరుద్యోగుల అండతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం గ్రంథాలయం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో తాము ధర్నాలు చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపి తమను గెలిపిస్తే న్యాయం చేస్తామని చెప్పి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అరకొర పోస్టులతో డీఎస్సీ పెడుతుందన్నారు. తాము చదువులు పక్కానపెట్టి కాంగ్రెస్ గెలుపునకు కష్టపడ్డామని తెలిపారు. గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులు పెంచాలని కోరారు. టెట్ క్వాలిఫై అయిన వారికి చదువుకునే సమయం కూడా ఇవ్వలేదన్నారు. వెంటనే డీఎస్సీ రద్దు చేసి మెగా డీఎస్సీ ప్రకటించాలని తెలిపారు. మోతీలాల్ వారంరోజులుగా పచ్చిమంచినీరు ముట్టకుండా నిరాహారదీక్ష చేస్తున్నారని ఆయనకు ఏమైనా అయితే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే నిరుద్యోగుల కోసం ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ప్రాంత నిరుద్యోగులు పాల్గొన్నారు.


మెగా డీఎస్సీ వేయాలని ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



మర్పల్లి: ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

మోమిన్‌పేట్, జూలై 1: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఎంపీడీవో యాదగిరి, తహసీల్దార్ మనోహరచక్రవర్తి అన్నారు. మోమిన్‌పేట్ ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించారు. ప్రతీ సోమవారం ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించాలని ప్రజలకు సూచించారు. అధికారులు పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి బి గీత, ఎంఈవో గోపాల్, ఏపీవో శంకరయ్య, ఏపీయం రాజు, ఐసీడీఎస్ అధికారిణి పుష్పలత, అటవీ శాఖ అధికారి మహేశ్, ఏఈవో పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మర్పల్లి తహసీల్దార్ గణేశ్, ఎంపీడీవో రాజమల్లయ్య ప్రజా దరఖాస్తులను స్వీకరించారు. ఉదయం పది గంటల నుచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూకు సంబంధించి ఐదు, పింఛన్ల మంజూరుకు మూడు దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

బంట్వారం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒకేఒక్క దరఖాస్తు వచ్చినట్లు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు అధికారులు ఉన్నారు. అదేవిధంగా కోట్‌పల్లి మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఒక దరఖాస్తు వచ్చిందని తహసీల్దార్ ఆశాజ్యోతి తెలిపారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్లు తెలిపారు.

ధారూరు: ధారూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆరు దరఖాస్తులు అందాయి. పట్టాదారు పాసుపుస్తకం మంజూరు, మురికి కాల్వ నిర్మించాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ బిల్లు అధికంగా వస్తుందని ఒక్కో దరఖాస్తు రాగా, పింఛన్ మంజూరుకు రెండు దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో నర్సింహులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్, ఎంపీవో షఫీ ఉల్లా, ట్రాన్స్ కో ఏఈ వేణుగోపాల్ రెడ్డి, ఐకేపీ ఇన్‌చార్జి ఏపీఎం పండరి, ఈజీఎస్ ఏపీవో సురేష్, ప్రజలు పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ ఒక దరఖాస్తు వచ్చిందని మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారి వై.అర్విండ్, పశు సంవర్ధక శాఖ ఏడీ ప్రభురాజ్‌లు హాజరయ్యారు.

తాండూరు రూరల్: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీడీవో విశ్వ ప్రసాద్ అన్నారు. తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రైతు బంధుతోపాటు ట్రైసైకిళ్లకు సంబంధించి రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, ఏవో రజిత, ఎంఈవో వెంకటయ్య, ఏపీఎం ఆనంద్‌కుమార్, ఎంపీవో రతన్‌సింగ్‌తోపాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్దేముల్: మండల పరిషత్ సమావేశం హాల్‌లో కార్యక్రమంలో మొదటిరోజు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా వాణిలో మొదటి రోజు మూడు దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో జర్నప్ప తెలిపారు. అందులో ఒకటి భూసమస్యకు సంబంధించినది కాగా మరో రెండు దరఖాస్తులు పింఛన్ల విషయమై వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఎవో నసీరుద్దీన్, పశు వైద్యాధికారి వెంకటరాజు, ఉపాధి హామీ ఏపీవో నర్సింహులు, ఐకేపీ ఏపీఎం బాలయ్య పాల్గొన్నారు.

యాలాల: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 21దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో పుష్పలీల తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఎంఈవో సుధాకర్‌రెడ్డి, వ్యవసాయాధికారి యాదగిరి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ ఆదేశానుసారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ హేమీబాయి ఆధ్వర్యంలో అధికారులు వివిధ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకన్నగౌడ్, బొంరాస్‌పేట్, దుద్యాల మండలాల తహసీల్దార్లు పద్మావతి, దానయ్య, ఎంపీవో మహేశ్‌కుమార్, ఏవో అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 12 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, ఏవో వీరస్వామి, ఎంపీవో కరీం, ఏపీఎం శోభ, ఇన్‌చార్జి ఏపీవో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బషీరాబాద్: బషీరాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆరు ఫిర్యాదులు వచ్చాయని ఎంపీడీవో జె.రాఘవులు తెలిపారు. రెవెన్యూ పరమైనవి నాలుగు, ఒకటి విద్యుత్‌శాఖ, ఎంపీడీవో కార్యాలయానికి సంబంధించిన ఒక దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. ఆయాశాఖల అధికారులకు అందజేసి వెంటనే సమస్యలు పరిష్కరమయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి వివిధశాఖల అధికారులు పలువురు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలుకింద పడి తండ్రీకూతురు దుర్మరణం

● తండ్రిని కాపాడే ప్రయత్నంలో కూతురు


శివానంద్ (ఫైల్)


చందన (ఫైల్)

మహబూబ్‌నగర్, జూన్ 1: రైలుకింద పడి తండ్రీకూతురు మృతి చెందారు. కుటుంబ కలహాలతో క్షణికావేశానికి లోనైన తండ్రి సమీపంలోనే ఉన్న రైలుపట్టాలపైకి వెళ్లగా అతన్ని కాపాడేందుకు వెంటనే వెళ్లిన కూతురు తండ్రితో సహా రైలుకింద పడి మృతి చెందింది. ఈ విషాద ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మందిపాల్ గ్రామానికి చెందిన శివానంద్(46) కొన్నేళ్ల కిందట మహబూబ్‌నగర్‌కు వచ్చాడు. ఇక్కడే ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య, కూతురు, కొడుకుతో కలిసి ఏనుగొండలో నివాసముంటున్నాడు. సోమవారం సాయంత్రం 7గంటల సమయంలో కుటుంబంలో జరిగిన చిన్నగొడవతో క్షణికావేశానికి లోనైన శివానంద్ చనిపోతానని ఇంటికి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలవైపు వెళ్లగా కూతురు చందన(17) తండ్రిని అనుకరిస్తూ వెళ్లింది. పట్టాలపైకి వెళ్లిన తండ్రి.. కూతురు వారిస్తున్నా వినలేదు. ఇంతలో అమరావతి రైలు రావడంతో తండ్రిని కాపాడేందుకు కూతురు కూడా పట్టాలపైకి వెళ్లింది. ఈ క్రమంలో ఇద్దరూ రైలుకింద పడి మృతిచెందారు. చందన ఎస్‌వీఎస్ ఆసుపత్రిలో డీఎంఎల్‌టీగా పనిచేస్తుండగా, కొడుకు ఇంటర్ చదువుతున్నాడు. విషయం తెలుసుకున్న భార్య సొమ్మసిల్లి పడిపోవడంతో ఆమెను చికిత్స నిమిత్తం ఎస్‌వీఎస్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను రైల్వే పోలీసులు జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కులకచర్ల, జూలై 1: కడుపు నొప్పి భరించక క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓవివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటన కులకచర్ల మండలంలోని తిరుమలాపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నీరటి సత్తయ్య భార్య రాములమ్మ(31) కొన్ని రోజులుగా కడుపు నొప్పితో ఇబ్బంది పడుతోంది. గతనెల 26వ తేదీన నొప్పి కాస్త అధికం కావడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబసభ్యులు పాలమూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రాములమ్మ సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

పురుగుల మందు తాగి బాలుడు..

కొడంగల్ రూరల్: పురుగుల మందు తాగి ఓ బాలుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గుండ్లకుంట గ్రామానికి చెందిన వడ్ల వెంకటేశ్(16) గత కొంత కాలంగా అనారోగ్య (శుద్ధకట్టు) సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో తల్లిదండ్రులు వెంకటేశ్‌కు ఆరు నెలలుగా హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో మూత్రం చేసే సమయంలో మూత్రనాళం మంట భరించలేక సోమవారం గుండ్లకుంట శివారులోని తమ వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంకటేశ్‌ను కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటేశ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి తండ్రి పెద్ద భీములు ఫిర్యాదు మేరకు సీఐ శ్రీధర్‌రెడ్డి ఆదేశానుసారం హెడ్‌కానిస్టేబుల్ శివరాములుగౌడ్ కొత్త చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

బొంరాస్‌పేట్, జూలై 1: మండలంలోని బోడబండ తండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్ ఫోన్ గత సంవత్సరం డిసెంబరు 30న చోరీకి గురైంది. దీంతో బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో లక్ష్మణ్‌నాయక్ ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ యాప్ ద్వారా దర్యాప్తు చేపట్టిన పోలీసులు పోగొట్టుకున్న ఫోన్‌ను గుర్తించి సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి అందించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది శివప్రసాద్ ఉన్నారు.

తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో చోరీ

తాండూరు , జూలై 1: కొడంగల్ రోడ్డు మార్గంలో ఉన్న తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో ఓ దొంగ చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం తాండూరు తహసీల్దార్ కార్యాలయంలోని మొదటి అంతస్థులోని సర్వేయర్ రూమ్ వద్ద ఉన్న అల్మారి, కుర్చీలను మాణిక్‌నగర్‌కు చెందిన రవి దొంగలించాడు. గమనించిన కాలనీవాసులు తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి తెలపడంతో పట్టుకున్నారని పోలీసులు వివరించారు. తహసీల్దార్ కె.తారాసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఏటీఎం చోరీకి యత్నం

తాండూరు , జూలై 1: గుర్తుతెలియని వ్యక్తి ఏటీఎంను పగులగొట్టి దొంగతనానికి యత్నించారు. ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. తాండూరు పట్టణం శాంత్ మహల్ థియేటర్ కాంప్లెక్స్‌లో యాక్సిస్ బ్యాంకు ఏటీఎం ఉంది. ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఏటీఎంలో గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించి రాయితో ఏటీఎంను పగులకొట్టి నగదు చోరీ దొంగతనం చేయడానికి ప్రయత్నించారని, ఆటోమేటిక్ అలారం సిస్టమ్ ద్వారా బ్యాంకు హెడ్ ఆఫీస్‌కు సమాచారం చేరిందని వివరించారు. బ్యాంకు వారు సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లగా దొంగ పారిపోయాడని పోలీసులు తెలిపారు. బ్యాంకు మేనేజర్, గౌతాపూర్ బ్రాంచ్ మేనేజర్‌ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. భారతీయ న్యాయ సంహిత నూతన చట్టం ప్రకారం తాండూరు పీఎస్‌లో నమోదైన మొదటి కేసు అని పోలీసులు వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

ఘట్‌కేసర్, జూలై 1: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనర్సింహ కాలనీలో సోమవారం రూ.13లక్షల పీఎం శ్రీ పథకం నిధులతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కౌన్సిలర్ చింతల రాజశేఖర్, హెచ్ఎం ఉమ్లానాయక్, ఏఈ వెంకట్, నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి తై బజార్‌కు రూ.10.07 లక్షలు

పరిగి, జూలై 1: పరిగి తైబజార్‌కు సోమవారం మునిసిపల్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2024-25 సంవత్సరంకుగాను వేలం నిర్వహించారు. ఈ వేలంలో పరిగికి చెందిన ఎండీ ఏజాజ్ రూ.10.07 లక్షలకు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు ఎదిరె కృష్ణ, టి.వెంకటేశ్, రవీంద్ర, మేనేజర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ ఈశ్వర్ జన్మదిన వేడుకలు


ఈశ్వర్‌ను సన్మానిస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, హరివర్ధన్‌రెడ్డిలు

మేడ్చల్ టౌన్, జూలై 1: గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ భేరీ ఈశ్వర్ జన్మదిన వేడుకలు సోమవారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ నాయకులు మధుయాష్కిగౌడ్, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, నాయకులు తోటకూర వజ్రేష్‌యాదవ్, నక్క ప్రభాకర్‌గౌడ్, ప్రజాకవి జయరాజ్ తదితరులు ఈశ్వర్‌ను పూలమాలలతో సత్కరించి శాలువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ దేవ, నాయకులు ఉప్పరపల్లి మహేశ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, రాజు, మన్నెం బాబురావు, సంజీవ పాల్గొన్నారు.

'వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి'

శామీర్‌పేట, జూలై 1: ఓస్కూల్ వార్డెన్ విద్యార్థులను మానసిక ఒత్తిడికి, భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని విద్యార్థులు, తల్లిదండ్రులు సదరు స్కూల్‌తో పాటు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. బాధిత విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని దిల్‌సుక్‌నగర్‌కు చెందిన లిరి, ఘట్‌కేసర్‌కు చెందిన హేమంత్ శామీర్‌పేట మండలం బాబాగూడ గ్రామ పరిధిలోని శాంతినికేతన్ విద్యాలయ స్కూల్‌లో ఐదోతరగతి చదువుతున్నారు. కాగా ఆ స్కూల్ వార్డెన్‌గా పనిచేస్తున్న రాకేష్ క్రమశిక్షణ, చదువు పేరుతో ఆ స్కూల్‌లోని పలువురు విద్యార్థులను అనేకరకాలుగా మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాడని, ఇంజక్షన్ ఇస్తానని అనేక రకాలుగా వార్డెన్ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని, భోజనంలో పురుగులు వస్తున్నాయని చెప్పినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోయారు. స్కూల్ వార్డెన్ రాకేష్ పెట్టిన వేధింపుల వల్లే ఎవరికీ చెప్పకుండా స్కూల్ నుంచి పారిపోయి ఇంటికి వెళ్లినట్లు బాధిత విద్యార్థులు తెలిపారు. దీంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సోమవారం శాంతినికేతన్ స్కూల్‌తో పాటు శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఇప్పటికైనా శాంతినికేతన్ స్కూల్ యాజమాన్యం, వార్డెన్ రాకేష్, సిబ్బందిపై చర్యలను తీసుకోవాలని తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరారు.

నర్సింహారెడ్డి కళాశాల అధ్యాపకులకు సీఎస్ఐ పురస్కారాలు

మేడ్చల్ టౌన్, జూలై 1: వివిధ అంశాల్లో ప్రావీణ్యం కనబరిచిన గుండ్లపోచంపల్లి మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్‌తో పాటు అధ్యాపకులకు సీఎస్ఐ అవార్డులతో సన్మానించారు. ఈ మేరకు అవార్డులు పొందిన వారని సోమవారం కళాశాలలో ప్రత్యేకంగా అభినందన సభను ఏర్పాటు చేశారు. సాంకేతిక విద్యారంగంలో ప్రావిణ్యం కనపరిచిన అధ్యాపకులకు, కళాశాల నిర్వాహకులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు ఈ అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులను విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్, ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ చేతుల మీదుగా అందుకున్నారు. కళాశాల డైరెక్టర్ ఎ.మోహన్‌కు బెస్ట్ డైరెక్టర్‌గా, బెస్ట్ ఔట్‌స్టాండింగ్ వలంటీర్ అవార్డును డాక్టర్ పయ్యావుల దినేష్ కుమార్‌కు, టెక్నికల్ ఆక్టివిస్ట్ స్టూడెంట్ బ్రాంచ్ సీఎస్ఈ విభాగానికి, బెస్ట్ పేపర్ ప్రెజెంటేషన్ అవార్డ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ సైబర్ సెక్యూరిటీ కరెంట్ పర్స్పెక్టివ్స్, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్సీ బెస్ట్ న్యాచురల్ డిజాస్టర్స్ ప్రిడిక్షన్ అండ్ ఎర్లీ వార్నింగ్ సిస్టం అనే అంశాలపై డాక్టర్ సుర్జీత్, సిరిమళ్ల సిరిచందనలకు ఎంపికచేసి అవార్డులతో సత్కరించారు. తమ కళాశాల అధ్యాపకులను అవార్డులతో సత్కరించడం ప్రశంసనీయమని కళాశాల చైర్మన్ జక్కుల నర్సింహారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి జక్కుల త్రిశూల్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ లోకనాథం, డీన్ శ్రీలక్ష్మీ, హెచ్ఓడీ పురుషోత్తం, తదితరులు ఉన్నారు.

కనిపించే దేవుళ్లు వైద్యులు


మేడ్చల్ టౌన్: అసిస్టెంట్ డీఎం అండ్ హెచ్‌వో ఆనంద్‌ను సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

ఘట్‌కేసర్, జూలై 1: కనిపించే దేవుళ్లు వైద్యులని, వారి సేవలు వెలకట్టలేనివని టీడీపీ ఘట్‌కేసర్ మండల అధ్యక్షుడు వేముల సంజీవ గౌడ్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి డాక్టర్లను శాలువాతో సత్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో కుటుంబ సభ్యులే దూరంగా ఉన్నప్పటికి వైద్యులు మాత్రం ప్రాణాలకు తెగించి రోగులకు సేవలందించడం మరిచిపోలేని విషయమన్నారు. ప్రభుత్వాసుపత్రులకు పేదలే వైద్యం కోసం వస్తారని వారికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రికి వివిధ మండలాల ప్రజలు వైద్యం కోసం వస్తారని అందుకే అప్పటి టీడీపీ ప్రభుత్వంలో 10పడకల ఆసుపత్రిని 50 పడలకలకు పెంచి అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు సామల జగన్‌మోహన్‌రెడ్డి, సిస్టా సూర్యనారాయణ, మడ్డి రాము, అనుపత్రి సూపరిండెంట్ కోట్యానాయక్ పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

మేడ్చల్ టౌన్: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లకు మేడ్చల్ పట్టణ వాసవీ క్లబ్ తరఫున సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అసిస్టెంట్ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఆనంద్‌తో పాటు సివిల్ ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఘనంగా డాక్టర్స్ డే

కొడంగల్: జాతీయ డాక్టర్స్ డే ను పురస్కరించుకొని సోమవారం స్థానిక నవీన ఆదర్శ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు డాక్టర్ బీదన్ చంద్రరాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డీవీ.నరేశ్‌రాజ్ మాట్లాడుతూ వైద్యులు దేవుళ్లతో సమానమని విద్యార్థులకు వివరించారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు డి.వెంకటయ్య, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు అరుణ, సంగీత, అరుణ జ్యోతి, నాజీయా, ఫాతీమా, గౌసియా, మేరాజ్ బేగం, శకుంతల, నాగేంద్రమ్మ, మహేందర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సాగు చేసేవారికే రైతు భరోసా ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో

ధారూరు, జూలై 1: సాగులో ఉన్న వ్యవసాయ భూములకే రైతు భరోసా ఇవ్వాలని, సాగులో లేని భూములకు రైతుభరోసా ఇవ్వకూడదని కోరారు. ధారూరు రైతు వేదిక, హరిదాసుపల్లి సహకారం సంఘం కార్యాలయంలో సోమవారం రైతు భరోసాపై రైతుల అభిప్రాయ సేకరణ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వందల ఎకరాల కొనుగోలు చేసి కడీలుపాతి పెన్సింగ్‌లు వేసి సాగు చేయకుండా వదిలేసిన భూములకు, వెంచర్లకు, సాగులో లేని కొండలు, గుట్టలకు రైతు భరోసా ఇవ్వకూడదని వారు ఖరాఖండిగా చెప్పారు. సాగులో ఉన్న భూములకే రైతు భరోసా ఇస్తే న్యాయం జరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఎంత విస్తీర్ణం భూమి ఉన్నా పది ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని, కౌలు రైతులకూ వర్తింప చేజయాలని రైతులు తెలిపారు. ధారూరు పీఏసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ సంపన్న వర్గాలకు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీచైర్మన్లు, ఎంపీపీ, జడ్పీటీసీలకు, ఎక్కువ వేతనాలు పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులకు రైతుభరోసా ఇవ్వకూడదని అభిప్రాయ పడ్డారు. జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ మాట్లాడుతూ రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేసి ప్రభుత్వానికి పంపిస్తామని, తదనుగుణంగా ప్రభుత్వం రైతు భరోసా పై మార్గదర్శకాలు రూపొందించి అమలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హరిదాసుపల్లి పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిరణ్, డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, సీఈవోలు నర్సింహులు, రవికుమార్, సిబ్బంది, ఏఈవో సంజూ రాథోడ్, రైతులు పాల్గొన్నారు.

పరిగి: సాగు భూములతోపాటు, పదెకరాలలోపు ఉన్న రైతులకే రైతుభరోసా అందించాలని సోమవారం పరిగి పీఏసీఎస్ కార్యాలయంలో జరి గిన రైతుల అభిప్రాయ సేకరణలో అధికారులకు రైతులు సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి అధ్యతన జరిగిన సమావేశంలో డీసీవో ఈశ్వరయ్య, పిఏసీఎస్ వైఎస్ చైర్మన్ ఎస్.భాస్కర్‌లతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని డీసీవో ఈశ్వర్యయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో బి.అమరేందర్‌రెడ్డి, ఏవో ప్రభాకర్‌రెడ్డి, నాయకులు బి.సుభాష్‌చందర్‌రెడ్డి, ఆర్.అంజనేయులు, బి.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కొడంగల్, మోమిన్‌పేట్‌లో..

కొడంగల్ రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకానికి రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు మంగళవారం కొడంగల్ పీఏసీఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ కటకం శివకుమార్‌గుప్త సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మోమిన్ పేట్: మండలంలో సొసైటీ చైర్మన్ బి.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైతుబంధుపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ కోసం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

సంక్షిప్తంగా..

● **శామీర్‌పేట:** సమాజంలోని ప్రతీఒక్కరు బాధ్యతగా మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీపీ ఎల్లూబాయి అన్నారు. మండలంలోని లాల్‌గడిమలక్‌పేట, అలియాబాద్ గ్రామాలకు సోమవారం ముఖ్యఅతిథిగా ఎంపీపీ ఎల్లూబాయి విచ్చేసి గ్రామ నాయకులతో, పంచాయతీ సిబ్బందితో కలసి వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఎల్లూబాయి, ఎంపీటీసీలు, ఆల ఇందిరా, కోడూరి అశోక్ ఎంపీడీవో మమతాబాయి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డిలు ఎంతో ఉత్సాహంగా మొక్కలను నాటారు.

● **తాండూరు:** శివాజీచౌక్ నుంచి గౌతాపూర్ శివారు వరకు అడుగడుగునా గుంతలుపడ్డాయి. భారీ వాహనాలు వెళ్తుండడంతో ఈ గుంతలు పడుతున్నాయని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇటాచీతో ఈ గుంతలను పూడ్చినట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణఅధ్యక్షుడు హబీబ్ లాల తెలిపారు.

● **బషీరాబాద్:** బషీరాబాద్‌లోని జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశానికి జూలై 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నర్సింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు) వద్ద భవనంలో కొత్తగా కళాశాల ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంటర్‌లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన ఉంటుందన్నారు. ఈ కళాశాలలో చేరిన విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించనున్నట్లు తెలిపారు.

● **మేడ్చల్ టౌన్:** గుండ్లపోచంపల్లి తాత్కాలిక కమిషనర్‌గా కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కె.శ్రీహరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన రాములు ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో కొంపల్లి కమిషనర్ శ్రీహరికి అదనంగా గుండ్లపోచంపల్లి మున్సిపల్ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ అధికారులు ఆదేశాలు జారీచేశారు.

● **దోమ:** రైతులు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏడీఏ సౌజన్య లక్ష్మీకుమారి సలహాలు, సూచనలు చేశారు. మండలంలోని మోత్కుర్‌లో సోమవారం ఆమె పంటల నమోదు ధృవీకరణ కార్యక్రమంలో భాగంగా రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. మొక్కజొన్న ఈనెల 15, పత్తి 20, కంది 15వ తేదీల వరకు విత్తుకోవాలని తెలిపారు. సోయాబీన్ ఈనెల 7వ తేదీ వరకు విత్తుకోవచ్చన్నారు.

● **కొడంగల్:** కొత్తచట్టాల అమలును సమర్థవంతంగా చేపట్టండంతో బాధితులకు మేలు జరుగుతుందని న్యాయవాది సుధాకర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఎస్పీ నారాయణ రెడ్డిలను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి నోట్‌బుక్‌లు అందజేశారు. కొత్త చట్టాల అమలుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

దోమ: అంకిత స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని ఖమ్మం నాచారం గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్ బ్యాగులు, మ్యాట్‌లు, చెప్పులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఆంజనేయులు, శ్రీశైలం, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బండి యాయ్య, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ బోయిని శ్రీశైలం, గ్రామస్థులు పాల్గొన్నారు.

● **కులకచర్ల:** విద్యార్థులు ఆరోగ్యకరంగా ఉండేందుకు రాగిజావ ఎంతో దోహదపడుతుందని ఎంఈవో హబీబ్ అహ్మద్ తెలిపారు. సోమవారం చౌడాపూర్ ఎంఈవో కార్యాలయంలో రాగిజావ పిండిని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు పంపిణీ చేశారు.

● **నవాబుపేట:** ఎల్లకొండకు చెందిన మాజీ వార్డుసభ్యుడు బోడ లక్ష్మణ్ సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య గ్రామానికి చేరుకొని ఆయన కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రావు గారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● **పరిగి:** అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలోని సోమవారం పరిగి మండలం కాళ్ళాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సీఐ ఎస్.శ్రీనివాస్ చేతుల మీదుగా ఉచితంగా బ్యాగ్‌లు, చెప్పులు, మ్యాట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు టి.వెంకటయ్య, వీణ, ఉపాధ్యాయులు నాగమణి, శ్రీనివాస్, సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.ప్రకాశ్ పాల్గొన్నారు.

● **కులకచర్ల:** మండలంలోని బిందెం తండా, పుట్టపహాడ్, అంతారం గ్రామ పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను మండల ప్రత్యేకాధికారిణి సరళ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఏపీఎం శోభ పాల్గొన్నారు.

● **బంట్వారం:** నాగ్వరం తండా , రోంపల్లి, మంగ్రాస్‌పల్లి ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలను పనులను ఎంపీడీవో రాములు సోమవారం పరిశీలించారు. ఆయన వెంట అధికారులు తదితరులు ఉన్నారు.

మెడికల్ కళాశాల భూసేకరణకు రైతులతో సమావేశం


మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

కొడంగల్, జూలై 1: ప్రభుత్వం ప్రతిష్ఠాకంగా కొడంగల్ ప్రాంతానికి మంజూరు చేసిన మెడికల్ కళాశాల ఏర్పాటులో భాగంగా భూసేకరణకు మరోసారి రైతులతో తాండూరు ఆర్డీవో శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అప్పాయిపల్లి శివారులో ఏర్పాటు చేయనున్న మెడికల్ కళాశాల కోసం సర్వే నెం.19లో గల భూ నిర్వాసితులతో ఆర్డీవో శ్రీనివాస్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్ చర్చించారు. సర్వే నెం.19లో అసైన్డ్ పట్టాలు పొందిన భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.10లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు ఇంటి నిర్మాణం కోసం వంద గజాలస్థలాన్ని కేటాయిస్తామని తెలిపారు. ఇందుకు భూనిర్వాసితుల్లో 63మందిలో చాలా మంది రైతులు అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. మిగతా రైతులు సైతం మెడికల్ కళాశాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన మెడికల్ కళాశాల ఏర్పాటుతో ఎంతోమందికి ఉపాధి లభిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. మెడికల్ కళాశాల భూసేకరణలో భాగంగా ఇప్పటికే పలుమార్లు చర్చలు జరపగా సమస్య కొలిక్కి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఐఐటీ పాఠ్యపుస్తకాల ఆవిష్కరణ

కొడంగల్, జూలై 1: పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో సోమవారం మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి చేతుల మీదుగా పాఠశాల యజమాన్యం ఐఐటీ పాఠ్య పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో విద్యార్థులకు ఐఐటీ, నీట్ ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రిన్సిపాల్ మక్సూద్‌అలీ మాట్లాడుతూ.. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 6 నుంచి 10వ తరగతి వరకు ఐఐటీ తరగతులను ప్రత్యేక ఉపాధ్యాయులతో బోధించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విష్ణు, కాశప్ప, సరిత, నర్సింహులు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.